
# మినర్వా పత్రిక



267

డా॥ వి. చంద్రశేఖరరావు



'కాసేపు కబుర్లు చెప్పుకుందాం,' అనుకున్నాం గానీ ఇవాల్టి మా సమావేశం గాయాల ప్రదర్శనలా మారింది. బ్రతుకు భయాలో, కనబడని దుఃఖాలో, ఉద్యోగం తాలూకు ఒత్తిడులో... కారణం తెలియదు.

హోటల్‌లో కూర్చుని, గుండ్రటి గాజుబల్ల చుట్టూ మూగి ఆరుగురు మిత్రులు, కవులం, జర్నలిస్టులం, రచయితలం, న్యూస్ ఛానల్స్ ఉద్యోగులం- ప్రపంచానికి కళ్ళు, చెవులు మేమే అన్న అహంకారం ఉన్నవాళ్ళం.

వచ్చి అర్ధగంట దాటినా మా మధ్య పెద్దగా కబుర్లు లేవు. ఈ నిశ్శబ్దం పై కాసేపు మాట్లాడుకున్నాం. మనం ఎందుకు మౌనాన్ని ప్రదర్శిస్తూ, బిగుసుకుపోయి ఉంటామని. హుషారైన మాటలు మన మధ్య ఎందుకు దొర్లవని. హోటల్ అద్దాల్లోంచి చూస్తే బయట రోడ్డు ఇనుపరంగు సరస్సులా ఉంది. రోడ్డు మొత్తం వాహనాలే.

"మినర్వా పత్రిక ఎడిటర్ సునీతారాణిపై జరిగిన దాడి గురించి మనం ఎవరం దిగులుపడలేదు. ఆవేశపడలేదు. కనీసం చిన్న ప్రొటెస్టు కూడా చేయలేదు" అన్నాను నిశ్శబ్దాన్ని బ్రేక్ చేస్తూ.

"హాస్పటల్‌లో ఉన్నప్పుడు, నేను ఆమెను కలిశాను. ఇంటర్వ్యూ కూడా తీసుకున్నాను. అయితే అది అచ్చులోకి రాలేదు," అంటూ కంపోజ్ చేసిన కాగితాల్ని టేబుల్‌పై విసిరాడు పరమశివం.

"ఆ మనోహరస్వామి కూడా దళితనాయకుడే. పైగా ఒకప్పుడు ఆమె భర్త. మనం ఏమని రియాక్టు కాగలం," అంది మోహిని. ఆంధ్ర దేశంలో సమస్త ఫెమినిస్ట్ ఉద్యమాలకు ఆదిదేవత అనుకున్న మోహినేనా అని విస్తుపోయాను.

''మనోహరస్వామి ఒక అధికార రూపం. సునీతారాణి అధి కారంపై ఎక్కుపెట్టిన ప్రశ్న. వాళ్ళ సంబంధం అంతవరకే,'' అన్నాడు పరమశివం.

''పది వేలయినా సర్క్యులేషన్ లేని చిన్న టాబ్లాయిడ్ పత్రిక అంత ఇంపాక్ట్ చూపిస్తుందా?'' మళ్ళీ ఆశ్చర్యం నటించింది మోహిని.

''ఆశ్చర్యాన్ని నటించకు, రెండుసార్లు నిషేధానికి గురయిన పత్రిక'' అన్నాడు సుందరం, విసుగ్గా ముఖ్యంపెట్టి. మళ్ళీ మేం నిశ్శబ్దంలోకి వెళ్ళాము. చరిత్రలోంచి కొట్టుకొచ్చిన ఆరుశవాల్లా కప్పుల కొద్దీ కాఫీ తాగుతూ.

హోటల్ చుట్టూ గాజు అద్దాలు. అద్దాలపై నాలుగైదు పక్షులు వాలి ఉన్నాయి. జీవం లేనట్లుగా, చర్మపు పక్షుల్ని అక్కడ తగిలించి నట్లుగా ఉన్నాయి.

టేబుల్ పైకి పరమశివం విసిరేసిన కాగితాల్లోంచి మమ్మల్ని వెక్కిరిస్తున్నట్లుగా సునీతారాణి ఇంటర్వ్యూ.

* * *

ప్ర:

జ: నలుపు మా అస్థిత్వం. మా నుంచి వేరు చేసేది కాదు. భగ వంతుడిలా రూపం లేనిది. మా పల్లెల్ని, ఊళ్ళని, మా శరీరాల్ని మొత్తాల్ని కప్పేది నలుపు. మా శ్వాసల్లోంచి, గుండెల్లోంచి మెల్లగా ప్రపంచం అంతా పాకి, కులం అనే ఊహ సంహరించబడి, నలుపు ప్రపంచానికి ఏకైక ప్రతీక అవుతుంది.

ప్ర:

జ: నెల రోజులుగా ఈ హాస్పటల్‌లో ఉన్నాను. ఆకాశంతో సంభాషించటం. సూర్యాస్తమయాల తరువాత మిగిలిపోయే రంగుల్ని చూడటం, మహానిశ్శబ్దాన్ని తూట్లు పొడిచే పక్షుల రావాల్ని వినడం- ఇదే పని. కాలిపై పొడవాటి పిండికట్టు నావైపు గుంభనంగా చూస్తుంది.





కత్తి వేటుకు రెండుగా చీలిన దళిత యువకుడు చిన్నా శరీరం, గదిలో నా ఎదురుగా; ప్రశ్నించడం నేరమయిన సందర్భం ఇది.

ప్ర:

జ: యుద్ధం జరుగుతూనే ఉంటుంది. పల్లెల చుట్టూ గూండాలు (రాజకీయ కార్యకర్తల పేరుతో) మూగి ఉంటారు. ఇళ్లు రక్షణ లేనట్టుగా, నడిరోడ్డు పైన నిలబడ్డట్టుగా, అన్ని వైపుల నుంచి తలుపులు మూసి ఉన్నాయి. సమస్తం ధ్వంసం అయిపో యింది. వందలాది దుఃఖాలు దాడి చేస్తున్న నేపథ్యం. ఆకలి, హింస, అటు ప్రపంచీకరణ, ఇటు నాయకుల వలస. మరణమంత గాఢ నిశ్శబ్దం మా పల్లెల్ని చుట్టుముట్టింది.

ప్ర:

జ: నాది చాలా చిన్న ప్రపంచం. నేను, నా ఏడేళ్ళ కూతురు. అది బలహీనమైన పిల్ల. చిన్నప్పుడు, దాని అన్నం నేను నమిలి, గుజ్జుని దాని నోట్లో పెట్టేదాన్ని. నా రొమ్ముల్లోంచి పాలు లావాలా ఉబికేవి. దానికి పాలిచ్చేటప్పుడు రొమ్ముల చుట్టూ మంచుగడ్డల్ని పెట్టుకునే దాన్ని. అప్పట్లోనే, మనోహరస్వామిని చెప్పుతో కొట్టి, అతడి తోటి జీవితాన్ని కాలితో తోసి వచ్చాను. ఊపున ఉన్న దళిత ఉద్యమాన్ని ఎమ్మెల్యే పదవికోసం తాకట్టు పెట్టిన ద్రోహి అతను.

ప్ర:

జ: మినర్వా పత్రికను రెండుసార్లు నిషేధించారు. దళితులను రెచ్చగొడుతున్న పత్రిక అని పేరు పెట్టారు. నాయకుల ప్రైవేటు జీవితాల్లోకి తొంగి చూస్తున్న ఎల్లో పత్రిక అన్నారు. అయితే నా నిబద్ధత వైపు వేలు చూపే ధైర్యం ఎవరికీ లేదు. నేను పూర్తిగా ధ్వంసం అయ్యేదాక పోరాటం సాగిస్తూనే ఉంటాను.

ఆ నాలుగు పేరాలు చదివేటప్పటికి మనసు చేదుగా అయ్యింది. గుండెల్లో అలజడి. మేము కూడా శత్రు శిబిరంలోకి చేరిపోయినట్లుగా.

మోహిని మొఖంలో పెద్దగా ఉద్వేగాలు లేవు. మినర్వా పత్రిక, ఒక పేపరే కాదని ఆవిడ అంచనా. BBC, CNN కనీసం NDTV. అదీ ఆవిడ స్థాయి. రేపు జరగబోయే ధర్నాని ఎట్లా పిక్చరైజ్ చెయ్యాలనేది ఆవిడ సమస్య. మోహిని 'వై' టీ.వీలో పని చేస్తుంది. సుందరం ముఖంలో అంతు తెలియని విషాదం. నెలరోజుల తరువాత కలుసు కున్న ఆనందం లేదు. ఇదొక సంతాపసభలా మారింది.

హఠాత్తుగా సుందరం గొంతు విప్పి ''నేను మరో మనోహర్ గురించి భయపడుతున్నాను'' అన్నాడు. అందరం ఉలిక్కిపడ్డాము. ''ఇవాళ ఉదయం మాయ చచ్చిపోయింది. నా కళ్ళ ముందే మెడ తెగిపోయి, గిలగిలలాడుతూ చచ్చిపోయింది. మనోహరనాయుడు ఇప్పుడు నా ఉద్యోగమే తీసేస్తాడో, జైల్లో వేయిస్తాడో, లేదా అనుచరు లతో కొట్టిస్తాడో'' అన్నాడు, భయం నిండిన కళ్ళతో.

''మాయ ఎవరు?'' అంది మోహిని. నేనూ సందేహంగా చూశాను.

పరమశివం మాత్రం పడీపడీ నవ్వుతున్నాడు. హ్యాండ్‌బ్యాగ్ లోంచి, ఇంకో రెండు రోజుల తరువాత విడుదల కావల్సిన సండే మాగజైన్ బయటకు తీశాడు. అట్టపైన మనోహరనాయుడు ముఖ చిత్రం. 'మాయ నా ఆల్టర్ ఎగో' అంటూ అతని వ్యాసం. పరమ శివం ఇంకా నవ్వుతూనే ఉన్నాడు. సుందరం అసహనంగా ముఖం పెట్టాడు. గాజు అద్దాలపై పక్షులు మళ్ళీ మరణాన్ని నటిస్తున్నాయి. అద్దాలకు అంటుకొని పడుకున్నాయి. చీకటి కొద్దికొద్దిగా ముసురు తున్న సమయం. రోడ్డుపై వాహనాలు, జనం కలిసిపోయి రోడ్డు లోతైన సముద్రంలా కనిపిస్తోంది.

''మనోహరనాయుడు వ్యాసం మీరు వినాలి. గొప్ప సోషియో ఫాంటసీ. మ్యాజికల్ రియలిజం టచ్ ఉన్న వ్యాసం. మీరు విని





తీరాలి,'' అంటూ సండే మాగజైన్ తీసి, అందులోంచి కొన్ని పేరాలు చదవటం మొదలుపెట్టాడు పరమశివం.

''మాయ నా అల్టర్ ఎగో.''

## 1

ఇది మరో పోలవరం జ్ఞాపకం. కుందేలు పిల్ల. దీన్ని మచ్చిక చేసు కొని, నిద్రపుచ్చే కళని ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను. చిన్న పిల్లలను నిద్ర పుచ్చినట్టుగా దీన్ని జోకొట్టి నిద్రపుచ్చుతాను. కళ్లు మూతలుపడి, అది నిద్రలోకి జారిపోతుంటే మొత్తం పోలవరం ప్రాంతాన్ని నా చేతుల్లో పొదువుకున్న ఫీలింగ్.

## 2

ఇది జంతువు అనే భావన నాకు కలుగదు. ఉదయాన్నే కాఫీ మగ్‌తో తోటంతా తిరుగుతాను. దీనితో సంభాషిస్తాను. పోలవరం, వెలు గొండ, పోతిరెడ్డిపాడు, అక్కడ నిర్వాసితుల గురించి నా ఆలో చనల్ని దీనికి చెబుతాను. నా దుఃఖాన్ని కోపోద్రేకాన్ని ఇది గమనిస్తూనే ఉంటుంది.

## 3

ఈ కుందేలు ఆ ప్రాంతాలకు చెందిన చివరి కుందేలు కావచ్చు. బుల్‌డోజర్లు, ప్రొక్లైనర్లు ఇప్పటికే పనులు మొదలుపెట్టాయి. నిర్వాసితులు కాబోయే జనంలాగా ఈ జంతువులూ కకావికలై తిరుగు తున్నాయి. ఆ ప్రాంతాల్లో తిరుగుతున్న నాకు నా కాళ్ళకు చుట్టుకొన్న ఈ కుందేలు పిల్ల కనబడింది. దీన్ని చేతుల్లోకి తీసుకొని ప్రతిజ్ఞ చేశాను. ముంపుకు గురికానున్న ప్రాంతాల ప్రజలకు పునరావాసం, సరైన నష్ట పరిహారం సాధించే వరకు పోరాడతానని. ఈ కుందేలును నా వెంట తెచ్చుకున్నాను. ఇది నాకు నిరంతరం నా కర్తవ్యం గుర్తు చేస్తుంది.

## 4

ఈ కుందేలు ఒక మెటఫర్. పర్యావరణ శాస్త్రజ్ఞులకు హెచ్చరిక. పోస్ట్ - డికన్‌స్ట్రక్షనిస్ట్‌లకు మానిఫెస్టో. ఇదొక అమూర్త ప్రతీక.

## 5

దీని ఎదురుగా కూర్చున్నప్పుడు ఉద్యమాల రోజులన్నీ గుర్తు కొస్తాయి. నా సమస్త దుఃఖాల్ని అవమానాల్ని, పోరాటాల్ని దీనికి నివేదిస్తాను. ఇది నా బయోగ్రాఫర్‌లా గంభీరమైన ముఖంతో వింటుంది. అగ్గిరవ్వలా వెలిగిన రోజుల్ని గుర్తుచేస్తాను. అవును, నేను యోధుణ్ణి, నాయకుణ్ణి, మహాగ్నిలా భగభగమన్నవాడిని. నేనో విషాదాంత నాటకాన్ని, మాక్‌బత్‌ని, హామ్లెట్‌ని, ఫీనిక్స్ పక్షిని, ఇవాల్టిని. కొత్త భారతదేశాన్ని.

## 6

ఈ కుందేలుకు నేను పెట్టిన పేరు 'మన్‌మోహిని'. మా అమ్మాయి దీన్ని 'సానియా' అని పిలుస్తుంది. నా స్నేహితులు, అనుచరులు దీన్ని 'మాయ' అని పిలుస్తారు.

## 7

దీనికొక బోను (రాబిట్ హౌస్) తయారుచేశానుగాని, అది బోను లా ఉండదు. చల్లని విశ్రాంతి గృహంలా ఉంటుంది. లోపల ఎయిర్ కూలర్, కార్పెట్టు. దాని అవసరాలకొక ప్రత్యేకమైన మనిషి. గ్రీన్‌హౌస్ నుంచి తెచ్చిన తాజా కూరగాయలు. ఇది ఆంతరంగిక అతిథి హోదాని అనుభవిస్తుంది.

## 8

మాయకు క్రమంగా మనుషులకు సంబంధించిన ఉద్వేగాలు అలవాటుపడ్డాయి. లేత జామపండు తింటూ అది హఠాత్తుగా విప్లవో ద్రేకంతో ఆలోచనలోకి వెళ్ళిపోతుంది. దాని బోనులో మినీ టీవిని





ఏర్పాటుచేశాము. డిస్కవరీ ఛానల్‌పై పెద్దగా ఆసక్తి చూపదు. BBC వరల్డ్‌ని ఇష్టంగా చూస్తుంది. మూడో ప్రపంచ దేశాల గురించిన ప్రసారాల్ని ఉత్సాహంతో చూస్తుంది.

**9**

ఆకలి చావులకు వ్యతిరేకంగా నేను చేసిన సైకిల్‌యాత్రను (వీడియోలో) చూసి మాయ చలించిపోయింది. గ్లోబలైజేషన్ పై నేను రాసిన వ్యాసాలన్నీ వినిపించినప్పుడు దాని కళ్ళలో వెలుగు. మాయ నా భవిష్యత్ పోరాటాలకు, కార్యాచరణలకు సింబల్ అయ్యింది. మాయ నా ఆల్టర్ ఎగో. నా సమస్త కర్తలకు సాక్షి. ఆంధ్రదేశపు రాజకీయాలను, నిర్దేశించే శక్తిగా నేను ఎదిగే క్రమంలో, మాయ ఇటీవలి నా ఇన్స్పిరేషన్.

* * *

పరమశివం చదవటం పూర్తి చేశాక నాలో విసుగు, కోపం. ఒక జోక్‌లా నవ్వుకోవాల్సిన ఈ మాయల మరణాన్ని ఇంత సీరియస్‌గా తీసుకోవాలా... 'యూ టూ బ్రూటస్...' అన్నట్టుగా సుందరం వైపు చూశాను. సుందరం మొహంలో ఏ ఫీలింగ్ లేదు.

'ఇది నవ్వుకోవాల్సిన విషయం ఏమీ కాదు. ముఖచిత్రంపై మనోహరనాయుడికి బదులు మాయ బొమ్మ ఉన్నా ఆశ్చర్యపడక్కర లేదు. ఒక పేపరు, ఒక టీవి ఛానల్, ఇప్పుడు రాజకీయాలు, మనోహరనాయుడు కొత్త తరం రాజకీయ నాయకుడు. వాడి పేపర్లో పని చేసే సబ్-ఎడిటర్ని కాలితో ముఖంపై తన్ని, నవ్వమనే శాడిజం వాడిది. 'నువ్వో కవివటగదా, మాయకు రోజూ కవిత్వం వినిపించు' అనేవాడు. ఈరోజు ఉదయం మేధాపాట్కర్‌లాంటి (పర్యావరణ) మేధావుల్ని వెంటవేసుకొని భద్రాచలం వెళ్ళాడు. అక్కడ బహిరంగసభ వగైరా. ఈ రోజు మాయ డ్యూటీ నాది. అది బోనులోంచి బయటకు వచ్చి, క్యారెట్ ముక్కలు తింటుండగా, రోడ్డు పైని వీధి కుక్కొకటి,

అమాంతం దానిపై దూకింది. ఎంత కసో, మెడ పుటుక్కున కొరి కేసింది. మాయ శరీరం నిండా రక్తం. క్షణాల్లో ప్రాణం పోయింది. ఏం చెయ్యాలో తోచక, ఇదిగో ఇట్లా వచ్చాను,'' అన్నాడు సుందరం బరువుగా నిట్టూరుస్తూ.

ఒక్కసారిగా నవ్వు, ఉత్సాహం, అంతలోనే నీరసం కలిగాయి. ఈ సుందరం ఒకప్పటి నా స్వప్నం. ఇప్పుడిట్లా శక్తులుడిగిపోయిన మాంత్రికుడిలా, కుందేళ్ళను పెంచుతూ, కాలం జారుడుబండ పై నుండి ఎంతగా జారాడు. ''చెప్పండి, మాయ గురించి, ఇప్పుడేం చేయాలి. ఎవరైనా సలహా చెప్పండి,'' అన్నాడు సుందరం నిస్సహాయంగా ముఖం పెట్టి.

నేను తేరుకొని ''మాయ చనిపోయి ఎన్ని గంటలైంది,'' అన్నాను కథలోకి వెళుతూ.

''మూడు గంటలు,'' అన్నాడు సుందరం.

''శుభ్రం చెయ్యి. శరీరంపై రక్తపు మరకల్ని కడిగివెయ్యి. చర్మాన్ని షాంపూతోనో, సబ్బుతోనో కడిగెయ్యి. తళతళలాడే తెల్లని కుందేలు దేహాన్ని మళ్ళీ ఎప్పటిలా దాని బోనులో పడుకోబెట్టు. ఆహారం నీళ్ళు పెట్టు. అప్పుడప్పుడు దాని భంగిమలు మార్చు. వాసన రాకుండా సెంటు చల్లు. మాయ బోనులోనే ఉంటుంది. చనిపోయిన సంగతి మర్చిపో. మనోహర నాయుడికి కావలసింది మాయ అనే ఊహ. అతనికి మాయ బతికుందో, చనిపోయిందో అవసరంలేదు. నువ్వు మాత్రం మరణానికి సేవలు చేస్తూ బతికెయ్యి,'' అన్నాను కసిగా.

బయట గాజు అద్దాలపై మరణాన్ని ప్రదర్శిస్తున్న పక్షులు మనుషుల హడావుడికి కదిలి, మళ్ళీ మరణపు భ్రాంతిలోకి వెళ్ళాయి. అందరం కాసేపు నిశ్శబ్దాన్ని నటించాము. ఎదురుగా కాఫీ కప్పులు. కాఫీపై నురగ ఇంకా తళతళలాడుతూనే ఉంది. రోడ్డుపై ఒక కొత్త





దృశ్యం కనబడింది. ఒక ఆడమనిషి తలపై గుడ్డల మూట. వెనుక ఆమె కుటుంబసభ్యులు. వాళ్ళు వలస కార్మికులో, ఊరు విసర్జించిన వాళ్ళో.

మోహిని గొంతు సవరించుకుంది. 'నన్ను వినండి' అన్నట్లుగా. నల్లరంగు చీరలో గోతిక్ కథల్లోని పాత్రలా ఉంది. వై టీవీలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్. ఆవిడ ప్రోగ్రామ్స్‌కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.

"రేపు టాంక్‌బండ్ సమీపంలో ఒక ధర్నా జరగబోతోంది. ప్రతిపక్షనాయకుడు VMR (వి.మనోహరరెడ్డి) ఈ ధర్నాని ఏర్పాటు చేశాడు. ఔటర్ రింగ్‌రోడ్డు వల్ల నిర్వాసితులు కాబోతున్నవాళ్ళతో. VMR మా MDకి బాగా దగ్గరివాడు. వై టీవీలో ఈ ధర్నా లైవ్ కవరేజ్ ఇస్తున్నాం. ఆ పని ఎం.డి. నాకు అప్పగించాడు- ఒట్టి ధర్నాలా కాకుండా కొన్ని నాటకీయ దృశ్యాల్ని కలిపి ధర్నాని ఎఫెక్టివ్‌గా చెయ్యాలి. మొత్తం ఈవెంటుని ఒక స్క్రిప్టులాగా రాసుకొచ్చాను. మీరు విని అవసరమైన చోట సలహాలివ్వాలి" అంది. ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను. జర్నలిజంలోనే కొత్త కాన్సెప్టు. ధర్నా లను కూడా తయారు చేసుకోవచ్చు. ముఖాలపై ఆసక్తిని పులుముకొని మోహిని వినిపించ బోయే దృశ్యాల కోసం మెదళ్ళ తలుపులు తెరిచాం.

* * *

"మబ్బులింకా ముసిరి ఉన్న ఉదయం. లోయర్ టాంక్‌బండ్ రోడ్డుపై పోసినట్టుగా జనం. వాళ్ళలో ఉద్రేకం, కోపం. వందలాది స్వరాలు కలిసిన హోరు. లారీలు ఇంకా వస్తూనే ఉన్నాయి. వాటి నిండా జనాలు."

వాళ్ళ చేతిల్లో ప్లకార్డ్స్, జెండాలు అన్నీ ఒట్టి అలంకారాలు కాకుండా, వాళ్ళలో పుట్టుకొచ్చిన ధిక్కార తీవ్రతకు గుర్తుల్లా ఉన్నాయి. అవి పట్టుకోవడం ద్వారా యుద్ధ పరికరం వాళ్ళ చేతికి అమరినట్టుగా వాళ్లు భావిస్తారు. ఇళ్ళను ఎప్పుడు కట్టుకున్నారు, ఎంత కష్టపడి కట్టా

రనేది, ఎవరికి వాళ్ళు పక్కవాళ్ళకు వివరిస్తుంటారు. ఔటరు రింగ్ రోడ్డు ద్వారా వాళ్ళకేమీ ఒరిగేది లేదని, ఎవరెవరి ప్రయోజనాల కోసమో దాని లేఅవుట్ మారుస్తున్నారని- ఆ కబుర్లను హైలైట్ చేస్తాము. వాళ్ళ ముఖాల పై కెమెరా ఫోకస్ అవుతుంది. కబుర్ల మధ్యన VMR సాధించిన విజయాల గురించి ప్రస్తావన వస్తుంది. అప్పుడు కెమెరా మనోహరరెడ్డి పైకి ఫోకస్ అవుతుంది. ఫైల్ షాట్స్ కొన్ని చూపిస్తాము. బహిరంగసభల్లో, అసెంబ్లీలో, ధర్నాల్లో, ఊరేగింపు చేస్తూ VMR రకరకాల రూపాల్లో ప్రత్యక్షం అవుతాడు.

ఊరేగింపు సన్నాహాలు చూపిస్తాము. ఊరేగింపు ముందు యాభై, అరవై యేళ్ళ ముసలివాళ్ళు, ముఖ్యంగా స్త్రీలుంటారు. వెనక ఉద్రేకపు కుర్రవాళ్ళు, ఎఫెక్ట్ కోసం గుంపు మధ్యలో చర్చి ఫాదర్ని, మైసమ్మ గుడి పూజారిని కూడా చూపిస్తాము. తలల చుట్టూ నల్ల రిబ్బన్లు కట్టుకున్న దళిత వేదిక కుర్రవాళ్ళు, గద్దర్‌లాగా మేకప్ చేసుకొన్న గాయకులు, ఒంటిపై నల్లటి గొంగళి, మెడలో ఎర్రజెండా, (సుందరం కోపంగా చూశాడు గద్దర్ ప్రసక్తి రావటంతోటే) ఇప్పుడు సీన్ కట్‌చేసి, ఔటర్ రింగ్‌రోడ్డు పరిసరాల్ని, కూల్చివేయబోయే ఇళ్ళను చూపిస్తాము. నల్లా దగ్గర నీళ్ళు పట్టుకొంటున్న ఆడవాళ్ళు, బస్సులకు వేళ్ళాడుతూ ఉద్యోగాలకు వెళ్ళేవాళ్ళు అక్కడ జీవితాన్ని రెండు నిమిషాల పాటు చూపిస్తాము.

తొమ్మిది గంటలవుతుండగా VMR అట్టహాసంగా దిగుతాడు కారులోంచి. ఒక్కసారిగా నినాదాలు. 'VMR జిందాబాద్' అంటూ. VMR వాళ్ళను వారించి ఔటర్ రింగ్‌రోడ్డుకు, ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేయిస్తాడు. ముందు వరుసలో ఉన్న ఆడవాళ్ళు VMR చుట్టూ మూగుతారు. 'అయ్యా మనోహరరెడ్డీ' అంటూ పెద్దగా రోదిస్తారు. ఒక్కొక్కళ్ళు ఒక్కో దుఃఖపు కథను బయటకు తీస్తారు. మాటలన్నీ కలిసిపోయి రొదలా మారిపోతుందా ప్రదేశం. కెమెరా పైకి





కదిలి ఒక ఏరియల్ షాట్‌లో ఆ దృశ్యాన్ని చూపిస్తుండగా, ఆ ఆలాపన దిగులుగా వినబడుతుంది.

"ఇది రాజకీయపార్టీలు చేసే గిమ్మిక్ కాదు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి చెప్పే ప్రయత్నం, నా రాజకీయాన్నంతా ఇంటి దగ్గర దాచి వచ్చాను. ఇక్కడ రాజకీయం అవసరం లేదు. ప్రజలున్నారు. వాళ్ళ బాధలున్నాయి. వాళ్ళ ఉద్రేకాలు, కోపాలున్నాయి. వాటికి రూపాన్నిస్తే చాలు." (డైలాగులు మరీ భారీగా ఉన్నాయన్నాడు పరమ శివం. 'వాడికసలు నోరు తిరుగుద్దా" అన్నాడు సుందరం. మోహిని కోపంగా చూసింది.)

"ఇది ప్రైవేటు ఉద్యమం కాదు. అందిరికీ ఆహ్వానం. అన్ని పార్టీలు, సంఘాలు కలిసి రావాలి. అందరం కలిసి పోరాడుదాం" అన్నాడు VMR.

ఊరేగింపు కొంతదూరం సాగాక, అంబేద్కర్ విగ్రహం దగ్గరకు వచ్చినాక, సహజంగానే పోలీసులు ఊరేగింపును అటకాయిస్తారు. అక్కడ రాస్తారోకో మొదలుపెడతారు. VMR అతని అనుచరులు కేకలు వేసుకుంటూ వాహనాన్ని ఆపేస్తారు. ఊరేగింపులో ఉన్న వాళ్ళందరూ రోడ్డుపై బైఠాయిస్తారు.

కొన్ని నిమిషాల పాటు వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అరణ్యఘోషలాంటి నినాదాలు ఉండవు. VMR రోడ్డు మధ్యన కూర్చుని పేపరు చదువుకుంటుంటాడు. VMR పై నుంచి కెమెరా ఫోకస్ తీసివేసి, అక్కడ కూర్చున్న వాళ్ళతో ఇంటర్వ్యూ మొదలు పెడతాం, దుఃఖపు తెరల మధ్యన వాళ్ళు తమ బాధల్ని చెప్పు కుంటారు.

టాంక్‌బండ్‌పై వాహనాలు ఆగిపోతాయి. పోలీసు వాన్‌లు సైరన్ మోగించుకుంటూ వస్తాయి. మైకులో ప్రకటన. 'రోడ్డు ఖాళీ చెయ్యండి,' అంటూ పోలీసులు నలువైపుల నుంచి చుట్టుముడ్తారు.

ఒక్కసారిగా ఆ ప్రదేశం ఉలిక్కిపడుతుంది. జనం కోపంతో ఊగి పోతారు. "పోలీస్ డౌన్‌డౌన్" అంటూ నినాదాలు. VMR శాంతించ మంటూ సైగ చేసి, 'నేను డిజిపితో మాట్లాడతాను. ఊరేగింపు కొన సాగుతుంది. మనం అసెంబ్లీ దాకా ఊరేగింపుగా వెళ్దాం' అంటాడు. VMRతో అక్కడున్న పోలీసు అధికార్లు గొడవ పడతారు. జనాన్ని బల వంతంగా లాగివేయటం మొదలు పెడతారు. VMR కోపంతో ఊగి పోతారు. 'మమ్మల్ని చంపుతారా?' అంటూ పెద్దగా కేకలు వేస్తాడు.

లాఠీఛార్జీ మొదలవుతుంది. కెమెరాలన్నీ పోలీసుల పైనే ఫోకస్ అవుతాయి. వాళ్ళ ముఖాలపై క్రౌర్యం. ఆవేశం. విరుగుతున్న లాఠీలు. తలలు పగిలి, రక్తం కారి, అరుపులు, కేకలు యుద్ధ రంగంలా మారి పోతుందా ప్రదేశం.

ఫట్‌మన్న చప్పుడు. అమ్మా అన్న కేక. ముందు వరుసలో వున్న వృద్ధురాలు రక్తధారలు కారుతుండగా రోడ్డుకు అడ్డంగా పడి వుంటుంది. (ఆవిడ పేరు మైసమ్మ అనుకుందాం). కెమెరా ఇప్పుడు మైసమ్మ పై ఫోకస్ అవుతుంది. రోడ్డు మధ్యన ఆమె శరీరం. రక్తం అటూ ఇటూ చిమ్మగా, గుండెలు బాదుకుంటూ అందరూ అటువైపు పరిగెడతారు. టాంక్‌బండ్‌పై నుండి అంబేద్కర్ విగ్రహం పక్కనుండి, పోలీసు జీపుల మధ్యనుంచి, జనం పరిగెత్తుకురావటం చిత్రిస్తాం. మైసమ్మ చుట్టూ మూగిన జనం. కేకలతో, ఏడుపులతో ఆ ప్రదేశం మహారోదన అవుతుంది. "లారీ ఎక్కే ముందే చెప్పింది. ఏదో అప శకునం తోస్తుందని" అంటూ ఇంకో ముసలమ్మ గుర్తు చేసు కుంటుంది. పోలీసులు కాస్త వెనక్కు తగ్గుతారు. అనుచరులు, పార్టీ కార్యకర్తలు VMR వైపు చూస్తారు. ఆయన 'ఊ' అంటే చాలు. జీపులు తగలబెట్టడం, రాళ్ళు విసరటం, కెమెరా VNR పైనే ఫోకస్ అవుతుంది. మైసమ్మ వైపు పరిగెడతాడు.





ముఖాన్ని చేతుల్తో కప్పుకుంటాడు. (VMRకి దుఃఖం వస్తుంది) తేరుకుని "ఎట్లా రియాక్ట్ కావాలో తెలియడం లేదు. ఈమె మనం దరికీ తల్లి, రండి, ఈవిడ శరీరాన్ని మోసుకొని అసెంబ్లీ వైపు వెళదాం. రాజధాని మొత్తం తిరుగుదాం" ఆవేశంగా అంటాడు. కట్ చేస్తే... జనం ముందు VMR. అనుచరులు మైసమ్మ శరీరాన్ని మోసుకొస్తుం డగా, అందరూ అసెంబ్లీ వైపు నడుస్తారు.

స్క్రిప్ట్ చదవటం ఆపి, "ఎలా ఉంది," అంటూ మావైపు చూసింది మోహిని.

"ఆవిడను ముందు హాస్పటల్‌కి తీసుకెళ్ళకుండా, రోడ్లపైన ఊరేగింపులేమిటి?" విసుక్కున్నాడు సుందరం.

"తల పగిలే మనిషి ఎవరైనా కావచ్చా? లేదా ముందుగా ఆ మనిషిని కూడా నిర్ణయిస్తారా?" అన్నాను నేను.

"వందలాది ధర్నాలు టెలికాస్ట్ చేశాము. అన్నిచోట్లా పోలీసులు లాఠీ చార్జీ చెయ్యటం, ఒకళ్ళవో, ఇద్దరివో తలలు పగలడం దాన్నే కాస్త డ్రమ్‌టైజ్ చేశాను," అంది మోహిని.

"వెల్ డన్, ఉద్యమాల్ని, ధర్నాల్ని, చావుల్ని సమస్తాన్ని ముందు గా తయారుచేసుకోగలుగుతున్నాం. ఇవాల్టి సృజనాత్మకత ఇదే. ఇందులో నీకు నూటికి నూరు మార్కులు" అన్నాడు పరమశివం, సీరియస్‌గా.

బల్లపై మళ్ళీ కాఫీ కప్పులు. నిండుగా నురగ, హాయైన వాసన. గాజు అద్దాలపైన పక్షులు. ఓపిక తెచ్చుకొని కిచకిచమంటూ చప్పుడు చేస్తున్నాయి. అద్దంపై ముక్కుతో పొడుస్తూ శబ్దం చేస్తున్నాయి. రోడ్డు కిక్కిరిసి ఉంది. వాహనాలు, మనుషులు, వరద ఉధృతిలో ఉన్న నదిలా.

మేం కాసేపు మాట్లాడుకోవటం మానివేశాము. మాటల్ని మర్చి పోయిన వాళ్ళలా దిక్కులు చూస్తున్నాము. పరమశివం హఠాత్తుగా

గొంతు విప్పాడు. "మన నాలుకలు ఎండిపోయాయి. ధిక్కారస్వరాలు ఆవిరైపోయాయి. మనం భాషే మర్చిపోయాం," అన్నాడు తాత్విక ధోరణిలో. సరిగ్గా ఆ సమయంలోనే రోడ్డుపై ఓ వింత సంఘటన జరిగింది.

పాతికేళ్ళ కుర్రాడు రోడ్డుపక్కన పేవ్‌మెంట్‌పై రెండు గుంజల్ని నాటి, వాటికొక బ్యానరు వేలాడదీశాడు. చుట్టూ ఉన్న ట్రాఫిక్‌ని, జనాన్ని పట్టించుకోవటం లేదు. అతని చేతుల్లో దినపత్రికల కట్ట, మినీ టీవీ ఉన్నాయి. తెల్లని బ్యానర్‌పై నల్లని అక్షరాలు.

"మనకు ఏ వార్తా వద్దు."

"మనం చదివేది, చూసేవి నిజాలు కావు."

"సమస్త మీడియాల్ని నిషేధిద్దాం."

ఆ బ్యానర్ చూసి మిత్రులందరం ఉలిక్కిపడ్డాం. అప్పటికే ఆ కుర్రాడి చుట్టూ జనం మూగారు.

"మీడియా అంతా అబద్ధం. అన్ని పత్రికలూ, టీవీ ఛానళ్ళూ నిజాల్ని దాస్తున్నాయి. మీరు గమనిస్తున్నారా?" అంటూ అరిచాడు.

చుట్టూ మూగిన జనంలో కలకలం. ఇదేదో వీధి నాటకంలోని భాగం అనుకున్నారు. నవ్వుకోవల్సిన విషయమేమో అనుకున్నారు. అయితే ఈ కుర్రవాడి మొహంలోకి చూస్తే అట్లా అనిపించలేదు వాళ్ళకు.

"మనం చూస్తున్నది. వింటున్నది. చదువుతున్నది నిజాల్ని కాదు. మన నరాల్ని ఉత్తేజపరిచే సెన్సేషన్‌ని. మన ఆలోచనలపై విసిరే రంగుల వలని. రోజూ చిటికెడు నల్లమందు పుచ్చుకుంటు న్నట్లు. ఇదంతా కుట్ర. మన ఆలోచనల్ని నియంత్రించే హిప్నాటిజం."

"దయచేసి పత్రికల్ని చదవద్దు. టీవీ ఛానళ్ళు చూడవద్దు. వినడానికి జోక్‌లా ఉండొచ్చుగానీ, ఇవి మన చుట్టూ పన్నిన వలలు, గాలాలు. తప్పించుకుందాం. మనం వెర్రి చేపలం కాదని వాళ్ళకు





తెలియజేద్దాం!" జనంలోంచి ఈలలు, చప్పట్లు. వాళ్ళు దీన్ని తమాషా అను కుంటున్నారు. రోడ్డుపై ట్రాఫిక్ ఆగిపోయింది. కార్ల హారన్ మోతలు, పోలీసుల విజిల్స్ గొడవగొడవగా ఉంది.

ఆ కుర్రాడు తన చేతుల్లో ఉన్న పత్రికలను, టీవీని పైకెత్తి చూపిస్తూ "ఇదంతా చెత్త, దుర్గంధం" అంటూ వాటిపై పెట్రోలు పోసి అంటించాడు. ఒక్కసారిగా మంటలు గుప్పుమన్నాయి. మంటలు అలల్లా పైకి లేచాయి. భయం గొలిపే ఎర్రని మంటలు. జనం భయంతో బిగుసుకుపోయారు. కేకలు, అరుపులు, అటూ ఇటూ పరిగెత్తటాలు. ఏ హెచ్చరికా లేకుండా ఆ కుర్రవాడిపై లాఠీతో దాడి చేశారు. మోహిని అప్పటికే తన టీవీ ఛానల్ వాళ్ళకు ఫోన్ చేసింది.

జనం పరుగులు, కేకల మధ్య ఆ కుర్రాడి ఆర్తనాదాలు వినబడ లేదు. "ఆ కుర్రాడు చేసిందాంట్లో తప్పేముంది," పరమశివం పెద్దగా అరిచేడు. దెబ్బల తాకిడికి శోష వచ్చి పడిపోయాడు ఆ కుర్రాడు. వై టీవీ వాళ్ళ వ్యాన్ వచ్చింది. లైట్లు ఫోకస్ అయ్యాయి. కెమెరాలు కళ్ళు తెరిచాయి.

ఆ కుర్రాణ్ణి పక్కకు లాగివేసి, ఆగిపోయిన వాహనాల్ని నడిపిస్తు న్నారు పోలీసులు. పరమశివం కోపంగా అన్నాడు. "ఎవరూ నోరెత్తరేమిటి? ఆ కుర్రాడు చేసిందాంట్లో నేరం ఏమిటి? ఇందులో పోలీసుల జోక్యం ఎందుకు? ఇది ప్రభుత్వమా? క్రూరజంతువా?" అంటూ ఉద్రేకపడ్డాడు. వై టీవీ వాళ్ళు జనం అభిప్రాయాలు సేకరిస్తున్నారు (లైవ్ షో).

మెల్లగా రోడ్డు ఖాళీ అవుతోంది. కుర్రాణ్ణి ఎవరో ఆటోలో తీసుకొని వెళ్ళారు. వాహనాలు కదిలాయి. మళ్ళీ హోటల్‌లో కాఫీ కప్పులతో.

"ఆ కుర్రాడ్ని 'మాయ నెంబరు-2' అందామా" అంది మోహిని నవ్వుతూ. నాకెందుకో నవ్వు రాలేదు. ఒక కొత్త చరిత్రను చూస్తున్న అనుభూతి. విషాదాంత నాటకంలోని ఒక ఘట్టాన్ని చూసినట్లుగా ఉంది.

హఠాత్తుగా పరమశివం ఉత్తేజితుడై, "అటు చూడండి," అంటూ రోడ్డువైపు వేలు చూపాడు. సునీతారాణి, కూతురుతో పాటు నడుచుకుంటూ వెళుతోంది. భుజానికి తగిలించుకొన్న బరువైన సంచులు. బహుశా మినర్వా పత్రిక కొత్త సంచిక అయి ఉంటుంది. షాపుల్లో ఇవ్వడానికి బయలుదేరి ఉంటుంది.

మా వైపు చూసి ప్రేమగా నవ్వింది. లోపలికి వచ్చి తలా ఒక పత్రిక ఇచ్చింది. (పది రూపాయలు చొప్పున తీసుకొని) "ఆదివాసీ స్త్రీ పోరాటాలపై ప్రత్యేక సంచిక తెచ్చాము," అంది. మా కాఫీ ఆతిథ్యాన్ని తిరస్కరించి, పాపతో సహా వెళ్ళిపోయింది. ఆమె అలా నడుచుకుంటూ వెళుతోంటే పోరాట యోధురాల్ని చూసినట్టుగా ఉంది. "సునీత కూతుర్ని చూడు, దాన్ని చూస్తుంటే మాయ నెంబరు-3లా ఉంది కదూ" అంది మోహిని యథాలాపంగా. నా చూపులు ఆ పాపాయి వైపు కదిలాయి. ఆ కళ్ళు నిశ్చలంగా ఉన్నాయి. ఆ కళ్ళలో ఎన్నో రహస్యాలు సజీవంగా ఉన్నాయనిపించింది. పిచ్చుకలు, వడ్రంగి పిట్టలు, చేపపిల్లలు, చెట్లు, వేలాడే పండ్లు, ఆడుకునే పిల్లలూ అన్ని దృశ్యాలూ ఆ కళ్ళలో ఉన్నాయి.

వాళ్ళ అమ్మ చేస్తున్న పోరాటాలు కూడా, ఆ కళ్ళలో రికార్డు అయి ఉంటాయి. వాళ్ళమ్మపై జరిగిన దాడి కూడా (అత్యాచారం, కాలికి ఫ్రాక్చర్) రికార్డు అయి ఉంటుంది. భీకరమైన అమ్మ కేకలు, ఆ తరువాత గాఢ నిశ్శబ్దం, స్తంభించిన సమయం, అన్నీ ఆ కళ్ళలో ఉండి ఉంటాయి.





'పిడికిలి బిగించి యుద్ధానికి వెళ్ళేముందు పాడే పాటేమిటి?' అంటూ వాళ్ళమ్మ నేర్పిన పాట ఆ పిల్ల నిత్యం మననం చేసుకుంటూనే ఉంటుంది.

ఆ పిల్ల నడుస్తూ, నడుస్తూ హఠాత్తుగా పిడికిలి బిగించటం నేను గమనించాను.

"ఆ పిల్ల, వాళ్ళ అమ్మ, వాళ్ళిద్దరు మన ఇవాళ్టి ఆశలు కాదా?" అన్నాను, అక్కడ కూర్చున్న నా మిత్రులతో.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 17 సెప్టెంబర్ 2006*